క్లుప్తంగా

బ్రాహ్మణపల్లి హైస్కూల్ పరిశీలన



పిడుగురాళ్లరూరల్: బ్రాహ్మణపల్లి హైస్కూల్‌ను సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు మంగళవారం సందర్శించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జాతర ఏర్పాట్లపై సమీక్ష

దుర్గి: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి జాతర మహోత్సవం ఏర్పాట్లపై బుధవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో సమీక్ష నిర్వహించనున్నారు. సమావేశానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరుకానున్నారు. మార్చి 12న తిరునాళ్ళ సందర్భంగా ఏర్పాట్లపై పీఆర్కే సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు.

25న పిడుగురాళ్లలో మెగా జాబ్ మేళా


పిడుగురాళ్ల: స్థానిక మార్కెట్ యార్డులో ఈ నెల 25న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గ స్థాయి మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ బాజిబాబు మంగళవారం తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాకు 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లమా, ఫార్మసీ, పీజీ చదివిన 19 నుంచి 39 ఏళ్ల మధ్య వయసు ఉన్న యువత హాజరు కావచ్చని వివరించారు. బయోడేటా, విద్యార్హత, ఆధార్‌కార్డు జిరాక్సులతోపాటు పాస్‌పోర్టు ఫొటోతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం



విజయపురిసౌత్: కృష్ణానదీ తీరాన విజయపురిసౌత్‌లో వేంచేసిన శ్రీ గోవిందమాంబ సమేత వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అర్చకులు వడ్లమాను గోవర్ధనాచార్యుల బృందం వేద మంత్రోచ్చారణలు, భాజాభజంత్రీల మధ్య కల్యాణ మహోత్సవాన్ని జరిపించింది. విశిష్ట అతిథులుగా శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 8వ తరం వారసుడు, కాకోయే పీఠాధిపతి బ్రహ్మశ్రీ నొస్సం వెంకటాద్రిస్వామి, ఆయన ధర్మపత్ని ఉమాదేవి హాజరయ్యారు. ఆలయ అర్చకులు, గుడి పెద్దలు, భక్తులు పూర్ణకుంభ కలశాలతో వారికి ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వెంకటాద్రిస్వామి, ఉమాదేవీలను మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీను పుష్ప గుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం స్వామి ఊరేగింపు జరిగింది.

క్రీడాకారులకు ఆదరణ పెరగాలి



పిడుగురాళ్ల: క్రీడాకారులకు ఆదరణ పెరగాలని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు చెప్పారు. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్‌లో భారత వనిత వారపత్రిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కార్క్‌బాల్ క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్క్ బాల్ ఆట ఆడేవారికి మరింత ప్రోత్సాహం అందించాలని, నేటి యువత అంతా ఆన్‌లైన్ గేములకు అలవాటు పడిపోతున్నారని, ప్రాంగణంలో ఆడే ఆటలపై మక్కువ చూపించేలా చూడాలని సూచించారు. తొలి మ్యాచ్‌లో పూర్ణ సీసీ, మనోజ్ సీసీ జట్ల మధ్య పోటీ జరగ్గా పూర్ణ సీసీ గెలుపొందింది. అనంతరం జానపాడు, అమరావతి జట్ల మధ్య పోటీ జరగ్గా జానపాడు జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో వనిత శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మురళీ, నాయక్, నిరంజన్, రవి, రత్నం, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖో–ఖో జట్టుకు శంకర భారతీపురం విద్యార్థిని

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల శంకరభారతీపురం జిల్లా పరిషత్ హైస్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక బోరుగడ్డ సౌజన్య రాష్ట్ర స్థాయి ఖో–ఖో జట్టుకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు వరప్రసాదు మంగళవారం వెల్లడించారు. ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు విశాఖపట్టణంలో నిర్వహించిన ఎస్ జీఎఫ్ఐ అండర్–14 బాలబాలికల ఖోఖో పోటీలకు సౌజన్య హాజరై రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైందన్నారు.

జై ‘హనుమంతు’

- పల్నాటి విప్లవ వేగుచుక్క
- తొలితరం స్వాతంత్య్ర యోధుడు
- నేడు మహావీరుని వర్ధంతి



కన్నెగంటి హనుమంతు విగ్రహం

దుర్గి: పల్నాటి పులి కన్నెగంటి హనుమంతు. జాతి జనుల విముక్తి కోసం తన లేలేత గుండె నెత్తుటిని తల్లి భారతి పాదాలకు పారాణిగా పూసిన నిష్కళంక దేశభక్తుడు. త్యాగధనుడు ఆయన. రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్య సేనలపై ఉక్కు పిడికిలి బిగించిన తొలితరం విప్లవ వీరుడు. పల్నాటి సీమలో అరుణారుణ కాంతులతో ప్రభవించిన ప్రభాత సూర్యుడు.

ఇదీ నేపథ్యం..

పల్నాడు జిల్లా దుర్గి మండలం మించాలపాడు గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో వెంకటప్పయ్య అచ్చమ్మ పుణ్య దంపతులకు జన్మించిన కన్నెగంటి హనుమంతు మహాత్మాగాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమానికి ఉత్తేజితుడయ్యాడు. పల్నాటి సీమలోని అడవుల్లో పుల్లలు ఏరుకోవటం, పశువులను మేపుకోవటంపై బ్రిటిషు పాలకులు విధించిన ఆంక్షలను తీవ్రంగా వ్యతిరేకించాడు. అహింసా మార్గంలో బ్రిటిషర్లపై పోరాడాడు. దీంతో కన్నెర్ర చేసిన జనరల్ టీజీ రూథర్‌ఫర్డ్ కన్నెగంటి హనుమంతును హతమార్చేందుకు ఆదేశాలిచ్చాడు. దీంతో అప్పటి కలెక్టర్ వెర్నర్ కొంత మంది స్థానిక వంచకులను చేరదీసి కన్నెగంటి కదలికలపై నిఘా పెట్టాడు. అప్పటి కరణం సదాశివయ్య సహకారంతో చర్చల పేరుతో కన్నెగంటిని పిలిపించి నిరాయుధుడై ఉండగా 1922 ఫిబ్రవరి 22న మహాశివరాత్రి పర్వదినం రోజునే 100 మంది సాయుధ దళం తుపాకులతో కాల్చి చంపింది. కన్నెగంటి పార్థివదేహాన్ని మించాలపాడు నుంచి కోలగుట్ల సమీపంలోని దంతెవాగుకు తరలించి అక్కడ ఖననం చేశారు. విషయం తెలుసుకున్న పల్నాటి ప్రజలు ఆగ్రహోదగ్రులై బ్రిటిష్ సేనలపై కారం, బరిశెలు, విల్లంబులతో తిరుగుబాటు చేశారు. బ్రిటిష్ సేనల తూటాలకు మరికొందరు భారతీయులు బలయ్యారు.



హనుమంతు ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న పీఆర్కే, కలెక్టర్ శివశంకర్ (ఫైల్)

కన్నెగంటి జీవితం స్ఫూర్తిమంతం

కన్నెగంటి జీవితం నేటితరానికి స్ఫూర్తిమంతం. ఆయన దేశభక్తి గురించి విద్యార్థులకు బోధించాల్సి ఉంది. కోలగుట్లలోని ఆయన సమాధిని వీరఘాట్‌గా అభివృద్ధి చేసి ప్రాచుర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ఏటా కన్నెగంటి హనుమంతు జయంతి, వర్ధంతులనూ ప్రభుత్వ లాంఛనాలతో జరిపించాలని ఆకాంక్షిస్తున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కృషితో ఆజాదీ కా అమృతోత్సవంలో భాగంగా కన్నెగంటికి ఘన నివాళులర్పించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని లబ్ధిదారుకు అందిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, చిత్రంలో స్థానిక ప్రజలు

- ప్రభుత్వ విప్ పీఆర్కే
- అమ్మాని జమ్మలమడకలో గడప గడపకు మన ప్రభుత్వం
- పిన్నెల్లికి హారతులు పట్టిన అక్కచెల్లెమ్మలు

మాచర్ల రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. మంగళవారం రాత్రి అమ్మాని జమ్మలమడకలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రతి గడపా పొందిన సంక్షేమ లబ్ధి గురించి వివరించారు. కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా పిన్నెల్లికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టి తీసి, హారతులు పట్టారు. యువకులు జై జగన్.. జై జై పీఆర్కే అంటూ నినాదాలు చేశారు. అనంతరం పిన్నెల్లి మాట్లాడుతూ గ్రామాలలో సచివాలయాలు, రైతు భరోసా, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, మన బడి నాడు నేడు ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, జగనన్న ప్రభుత్వం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని చెప్పారు. బలహీన వర్గాలకు చట్టసభల్లో ప్రాతినిథ్యం కల్పిస్తున్న పార్టీ తమదని, బీసీలంటే బ్యాక్ బోన్ క్యాస్ట్ అని నిరూపించామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పెదమల్లు స్వామి, వైస్ ఎంపీపీ పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, సర్పంచ్ ముక్కా చౌడయ్య, వడితె అంజమ్మ, సొసైటీ చైర్మన్ గుత్తికొండ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసి పరిమళ ఏసోబు, యార్డు డైరెక్టర్ లక్ష్మయ్య, నాయకులు తిప్పారెడ్డి గోపాల్‌రెడ్డి, గొబ్బూరి ఆదెయ్య, ముక్కా గురవయ్య, మాజీ ఎంపీపీ పేర్ల మల్లయ్య, వడితె బాబునాయక్, మున్నా రామకృష్ణ, దుర్గెంపూడి సీతారామిరెడ్డి, వీర్ల శ్రీనివాస్, గంగనబోయిన లక్ష్మయ్య, మల్లెల శ్రీనివాసరావు, మాచర్ల మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ తురక కిషోర్, కౌన్సిలర్లు రామిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పిన్నెల్లి శంకుస్థాపన

కారంపూడి: స్థానిక ఎస్సీ కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాలు, కల్యాణ మండపం నిర్మాణాలకు ప్రభుత్వ విప్, జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీఆర్కేకు స్థానికులు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా పీఆర్కే చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. సుమారు రూ.50 లక్షల విలువైన స్థలం ఇచ్చి, అందులో కమ్యూనిటీ హాలుతో పాటు కల్యాణ మండపం నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్ పీఆర్కేకు పాస్టర్ దేవదానం, పెద్దలు కాల్వ ప్రభుదాసు, ఇస్రాయేలు, కాల్వ కోటేశ్వరరావు, భూషణం, ప్రవీణ్, ఇస్సాకు, వి.వెంకయ్య, ఎం.విజయ్(భారత్ గ్యాస్), చినపున్నయ్య, సుదర్శన్ కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు. పీఆర్కేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితే జానాయక్, ఆ ప్రాంత ఎంపీటీసీ అంతరగడ్డ యేసోబు, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు బొమ్మిన అల్లయ్య, కొంగర సుబ్రమణ్యం, సీఐ జయకుమార్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి స్పష్టీకరణ
- చెన్నాయిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల రూరల్: సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. మూడున్నరేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధి గురించి చెప్పారు. కరపత్రాలు అందించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం సీఎం అనుక్షణం తపిస్తున్నారని, దీనికి ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపే నిదర్శనమని కొనియాడారు. బీసీలను రాజకీయంగా వాడుకునే వదిలేసే పార్టీ టీడీపీ అని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి, అల్లు పిచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ గండికోట కోటేశ్వరరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ గండికోట రమాదేవి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తిమ్మరాజు రామ కోటేశ్వరరావు, మాజీ సొసైటీ అధ్యక్షులు మిట్టా అచ్చయ్య, మండల యూత్‌కన్వీనర్ పి. నాగరాజు, మాజీ సర్పంచ్‌లు జంగిటి నాగయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, చల్లంచర్ల సుబ్బారావు, గ్రామ ఇన్‌ఛార్జి శివాయాదవ్, యూత్ నాయకులు ముత్యం జంగమయ్య, బండారు శ్రీను, సొసైటీ అధ్యక్షులు పాలినేడి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు జంగిటి చిన్న శ్రీనివాసరావు, రామ కోటేశ్వరరావు, రామిరెడ్డి, గున్నంరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. చెన్నాయిపాలెం గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ప్రజలు మండల కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉన్న ఊళ్లోనే ఇంటికి దగ్గరలోనే ఉన్న సచివాలయంలో తమ సమస్యలు పరిష్కరించుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుత వ్యవస్థను ఏర్పాటు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాశయ్య, కరాలపాడు వైద్యులు వెంకట ప్రవీణ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి, అల్లు పిచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ గండికోట కోటేశ్వరరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ గండికోట రమాదేవి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తిమ్మరాజు రామ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సెల్‌ఫోన్ షాపు ప్రారంభం

పిడుగురాళ్ల: పట్టణంలోని కొనకొండ్ల కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఏబీ సెల్ పాయింట్‌ను మంగళవారం గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కాలే మాణిక్యరావు, గొట్టిముక్కల పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

మాచవరం: బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలను ఆపి మహిళ మెడలోని బంగారు గొలుసును అపహరించిన ఘటన మండలంలోని పిల్లుట్ల గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మల్లవోలు గ్రామానికి చెందిన దంపతులు గాసి అంకారావు, పద్మ ఈనెల 10న రాత్రి సమయంలో పిడుగురాళ్ల వైపు నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కొత్త గణేశునిపాడు, పిల్లుట్ల గ్రామాల మధ్యలో కొత్త కాలనీ మూల మలుపు వద్దకు రాగానే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఆపి పద్మ మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బంగారు గొలుసు విలువ సుమారు రూ.90 వేలు ఉంటుంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



పిడుగురాళ్ల : మండలంలోని జానపాడులో టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గుత్తికొండ గ్రామానికి చెందిన దాసరి శామ్యూల్ (80) కరెంట్ బిల్లు కట్టి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొని మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు పల్నాటి వెంకన్న తిరునాళ్ల



వేంకటేశ్వర స్వామి ఆలయం (అంతరచిత్రం) స్వామి విగ్రహం

గురజాల : నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురం గ్రామంలో వేంచేసిన అలివేలు మంగా పద్మావతీ వేంకటేశ్వరస్వామి 47వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం జరగనున్నాయి. పల్నాడు ప్రాంతం కొంగుబంగారంలా.. వరాల రేడుగా పేరుపొందిన స్వామి తిరునాళ్లకు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యారు. ఉత్సవాలకు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లూ పూర్తిచేస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

బ్రహ్మోత్సవాలు ఇలా..

ఈనెల 22న ఉదయం స్వామికి స్నపనతిరుమంజనం, సాయంత్రం వేళ వాసుదేవ పుణ్యాహవచనం, అంకురార్పణ, హోమం, ధ్వజారోహణం, దేవతాహ్వానం, 23న హోమం, బలిహరణం, బొగ్గవరపు సీతామహాలక్ష్మీచే అన్నమయ్య సంకీర్తనల ఆలాపన, ఎదురుకోలు ఉత్సవం, అన్నసంతర్పణ, మధ్యాహ్న సమయంలో అలివేలుమంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణం, కూనిరెడ్డి నాగిరెడ్డిచే బాలికలచే కోలాట కార్యక్రమం నిర్వహించనున్నారు. రాత్రి సమయంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన జరుగుతుంది. 24న హోమం, బలిహరణం, గరుడసేవ, పూర్ణాహుతి, నాగవల్లి, ఉద్వాసన, ధ్వజపట ఉద్వాసన, 25న హనుమంత్ వాహన సేవ, రథోత్సవం, వసంతసేవతో తిరునాళ్ల మహోత్సవాలు ముగియనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బీసీల వెన్నుదన్ను సీఎం జగన్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రామాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

దాచేపల్లి : బలహీనవర్గాల బలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో 14 మంది బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడంపై మంగళవారం వారు హర్షం వ్యక్తం చేశారు. నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బలహీనవర్గాల ఆశాజ్యోతి సీఎం జగన్ అని నినదించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు దేవళ్ల వీరాస్వామి, బత్తుల బాలయ్య, పల్లపు వెంకటేశ్వర్లు, నేతలు బత్తుల వెంకయ్య, పల్లపు హనుమంతరావు, గుంజా వెంకట్రావ్, లాయర్ శ్రీనివాసరావు, ఓర్సు దుర్గారావు, ఉప్పుతల యల్లయ్య, ఉప్పుతల నరసింహరావు, బండల శ్రీను, తమ్మిశెట్టి సత్యనారాయణ, గుంజా శివ పాల్గొన్నారు.

వడ్డెరల వరాల రేడు సీఎం

వెల్దుర్తి: వడ్డెర సామాజికవర్గానికి తొలిసారిగా చట్టసభల్లో ప్రాతినిథ్యం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్ చెప్పారు. మంగళవారం మాచర్లలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు చట్టసభల్లో వడ్డెరలకు స్థానం దక్కలేదని, ఇప్పుడు ఆ వర్గం నుంచి ఎమ్మెల్సీని ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కోటాలో చంద్రగిరి ఏసురత్నం పేరును ఖరారు చేయడం సంతోషంగా ఉందన్నారు. మాచర్ల ఎంఈఓ వేముల నాగయ్య మాట్లాడుతూ సీఎం జగన్ వడ్డెర సామాజికవర్గాన్ని గుర్తించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం కోదండ రామాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, కొట్టు వెంకటేశ్వర్లు, కొమెర అనంతరాములు, అంకయ్య, వేముల కళ్యాణి, మంజుల మల్లికార్జునరావు, మహంకాళి పిచ్చయ్య, బత్తుల రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: ప్రతి ఒక్క విద్యార్థి ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి చెప్పారు. మంగళవారం స్థానిక బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రేరణ–శిక్షణ తరగతులు కార్యక్రమంలో భాగంగా మాచర్ల డివిజన్ పరిధిలోని 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ టి.వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి ఏబీసీడబ్ల్యూఓ శివనాగేశ్వరరావు, మాచర్ల ఏబీసీడబ్ల్యూఓ ఎస్.రాజేష్‌దాస్, వార్డెన్‌లు గంగాధర్‌రావు, టి. శ్రీనివాసరావు, ఎస్‌కే మస్తాన్ పాల్గొన్నారు.

రామకృష్ణ పరమహంస జయంత్యుత్సవం



రెంటచింతలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వెల్దుర్తి/రెంటచింతల: రామకృష్ణ పరమహంస జయంత్యుత్సవం పట్టణంలోని యూపీ స్కూల్‌లో అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ పరమహంస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం అందుగుల చంద్రయ్య, ముత్యాల పాపిరెడ్డి, అగతమ్మ, మదర్‌థెరిస్సా సేవా సమితి అధ్యక్షులు శాంతిరెడ్డి, కృష్ణారెడ్డి, సభ్యులు షేక్ చినలాలుసాహెబ్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రామకృష్ణ పరమహంస సూక్తులు ఆచరణీయం

రామకృష్ణ పరమహంస సూక్తులు ఆచరణీయమని స్థానిక శ్రీ రామకృష్ణ సేవామండలి అధ్యక్షులు గుంటక కాశిరెడ్డి చెప్పారు. మంగళవారం రామకృష్ణ పరమహంస జయంత్యుత్సవం సందర్భంగా రామకృష్ణ గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి సేవామండలి సభ్యులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సేవా మండలి కార్యదర్శి గుండా వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు రాచమడుగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్కే పరామర్శ

కారెంపూడి: మండలంలోని గాదెవారిపల్లె గ్రామంలో గత సోమవారం మృతి చెందిన రైతు కూనిరెడ్డి 3వ సైదారెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం సాయంత్రం పరామర్శించారు. సైదారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పారు.

తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలు

శావల్యాపురం: ముంద్రువారిపాలెం గ్రామంలో బాల వికాస సాంఘిక సేవా సంస్థ వారి సారథ్యంలో ఉచితంగా తాగునీటి శుద్ధీకరణ పథకం ఏర్పాటు చేయడానికి గ్రామ సభ నిర్వహించినట్లు బాలవికాస్ సొసైటీ ప్రతినిధి కటకం అబ్బులు మంగళవారం తెలిపారు. బాల వికాస్ సంస్థ ఆధ్వర్యంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సౌజన్యంతో నియోజకవర్గంలో ఐదు గ్రామాలను ఎంపిక చేసి తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.